క్లుప్తంగా

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



తిరువూరు: ఏ.కొండూరు మండలం రామచంద్రాపురంలో నూతనంగా నిర్మించిన శివ దత్తసాయి మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. సాయిబాబా, నంది, వినాయకుడు, దత్తాత్రేయ విగ్రహాలతో పాటు శివలింగాన్ని ఆలయ నిర్మాణ కర్తలు, ప్రవాస భారతీయులు గుంటక సుదర్శనరెడ్డి కుటుంబ సభ్యులు ప్రతిష్ఠించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ అందజేత



తిరువూరు: మండలంలోని చిట్టేల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత పరీక్ష నిమిత్తం మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఉపకరించే మెటీరియల్‌ను సైన్స్ ఉపాధ్యాయుడు మచ్చా శ్రీనివాస్ అందజేసినట్లు హెచ్ఎం పీవీఎస్ ప్రసాద్ తెలిపారు. అర్హత పరీక్షలో రాణించిన విద్యార్థులకు ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ అందజేస్తారని చెప్పారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



మైలవరం: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మైలవరం మండలం వెల్వడం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఎం.వరుణ్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఎం.బసవరావు సోమవారం తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సీనియర్ విభాగంలో షార్ట్ పుట్‌లో తృతీయ స్థానం సాధించాడన్నారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వరుణ్ పాల్గొంటాడని చెప్పారు. విద్యార్థిని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు అభినందించారు.

శోభనాచలునికి ప్రత్యేక పూజలు



ఆగిరిపల్లి: స్థానిక శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పవిత్రోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, స్నపన, ప్రత్యేక అలంకరణ, నీరాజన మంత్రపుష్ప తీర్థ వినియోగాలను, ప్రధాన అర్చకులు వేదాంతం శేషబాబు, అనంత కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ సాయి పర్యవేక్షించారు.

నాటు సారా కేంద్రాలపై డ్రోన్‌తో నిఘా



చాట్రాయి: డ్రోన్ కెమెరాలతో నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు చేయనున్నట్లు ఎస్ఐ డి.రామకృష్ణ తెలిపారు. మండలంలోని పోతనపల్లి అటవీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాతో నాటు సారా కేంద్రాలపై దాడుల్లో సోమవారం ఆయన సిబ్బందితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నాటు సారా తయారీ, విక్రయాలు, జూదాలపై దాడులు నిర్వహిస్తామన్నారు. అనంతరం పట్టుబడిన ఊటను ధ్వంసం చేశారు.

రూ.436లకే ప్రమాద బీమా

చాట్రాయి: బ్యాంక్ ఖాతాదారులు రూ.436 చెల్లిస్తే రెండు లక్షల ప్రమాద బీమా చెల్లిస్తామని చాట్రాయి ఎస్‌బీఐ మేనేజర్ కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తక్కువ మొత్తాలకు అనేక ప్రమాద బీమాలు ఉన్నాయని ప్రజలు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలో ఇటీవల చనిపోయిన మొలుగుమాటి సీతమ్మ, ఇడుపులపాటి ఝాన్సీ, తోకల రమాదేవి, గొల్లమందల లక్ష్మీ కుటుంబాలకు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద ఒక్కొక్కరికీ రూ.2 లక్షలను అందజేశారు.

అత్యవసరానికి తప్పని అవస్థలు!

- నూజివీడులో సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలలు లేని వైనం
- దృష్టి సారించని పాలకులు



గతంలో కూల్చి వేసిన సామూహిక మరుగుదొడ్లు(ఫైల్)

నూజివీడు: 10 మండలాలకు కూడలిగా రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, నియోజకవర్గ కేంద్రంగా, విద్యాసంస్థలకు నిలయంగా, న్యాయ స్థానాలకు కూడలిగా విలసిల్లుతున్న నూజివీడు పట్టణంలో సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక పట్టణానికి వచ్చే ప్రజలు, వ్యాపార దుకాణదారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ స్థాయి కార్యాలయాలతో పాటు మండల స్థాయి కార్యాలయాలు, కోర్టులు, విద్యా సంస్థలు, వ్యాపార సమూహాలు, ఆస్పత్రులు, వర్తక వాణిజ్యాలకు కేంద్రంగా నూజివీడు అభివృద్ధి చెందుతోంది. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ అవసరాల నిమిత్తం నియోజకవర్గం నుంచే కాకుండా రెవెన్యూ డివిజన్‌లోని ఆరు మండలాల నుంచే కాకుండా చుట్టు పక్కల ఉన్న మరో నాలుగు మండలాల నుంచి ప్రతి రోజూ వేలాది మంది మహిళలు, పురుషులు నూజివీడు వస్తున్నారు. వీరు వారి పనుల నిమిత్తం ఉదయం నుంచి సాయంత్రం వరకు నూజివీడులోనే ఉంటారు. ఈ నేపథ్యంలో పట్టణంలో సులభ్ కాంప్లెక్స్ తరహాలో ఎక్కడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణానికి పలు పనుల నిమిత్తం వచ్చే వారే కాకుండా దుకాణాల్లో పనిచేసే గుమస్తాలు, కొనుగోలుదారులు, ఇతరులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలని వినతి..

ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, కోర్టులు, పోలీసు స్టేషన్లలో పని ఉన్నవారు వారి పని నిమిత్తం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో పురుషులైతే మూత్ర విసర్జనకు ఖాళీ ప్రదేశాలను ఆశ్రయిస్తున్నారు. మహిళల పరిస్థితి అయితే అత్యంత దారుణంగా ఉంటోంది. సమీపంలోని గృహాల వారిని బతిమిలాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మరుగుదొడ్డికి వెళ్లాలంటే ప్రతి ఒక్కరూ బస్టాండ్‌కు పరుగులు పెట్టాల్సి వస్తోంది. 70 వేల జనాభా కలిగి పురపాలక సంఘంగా మారి దాదాపు 38 ఏళ్లు గడిచినా పట్టణంలో సులభ్ కాంప్లెక్స్ తరహాలో మరుగుదొడ్లు లేకపోవడం వింతగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. వామపక్షాలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు గతంలో పలుసార్లు ఆర్డీఓకు వినతిపత్రాలు అందజేశారు. గతంలో అమెరికన్ ఆస్పత్రి పక్క వీధిలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో అవి శిథిలావస్థకు చేరగా, వాటిని 2018లో కూల్చి వేశారు. గతంలో మైలవరం రోడ్డులోని బస్టాపు పక్కన ఉన్న పేతురు వాగుపై సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారే కాని ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు సులభ్ కాంప్లెక్స్ తరహాలో మరుగుదొడ్లు నిర్మించాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మరుగుదొడ్లు లేక ముఖ్యంగా మహిళలు నరకయాతన అనుభవిస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులకు, ఆర్డీఓకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పలు చోట్ల మరుగుదొడ్లు నిర్మించాలి.

– చాట్ల పుల్లారావు, సీపీఐ నాయకుడు, నూజివీడు

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో భర్తీకాని సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవిబాబు తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి గతంలో ప్రవేశ పరీక్షకు హాజరైన, హాజరు కాని వారు కూడా ఈ నెల 6వ తేదీ లోపు నేరుగా తమ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

22న తిరువూరులో జాబ్‌మేళా

తిరువూరు: స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 22వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు స్థానిక శాసనసభ్యుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. ప్రైవేట్ కంపెనీలు ఈ మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తాయన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ తదితర కోర్సులు చేసి, ఆసక్తి కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు మేళాలో పాల్గొనాలని సూచించారు.

గుండెపోటుతో సర్పంచి మృతి

తిరువూరు: ఏకొండూరు మండలం మత్రియా తండా గ్రామ సర్పంచి భూక్యా నాగరాజు(45) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. ఇంటి వద్ద హఠాత్తుగా గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం. నాగరాజు మృతికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

తిరువూరు: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని, పసిబిడ్డల్లో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కృష్ణకుమారి తెలిపారు. గంపలగూడెం మండలం ఊటుకూరు సెక్టారు పరిధిలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. గ్రామంలోని 24 మంది గర్భిణులకు సీమంతం నిర్వహించారు. గ్రామ ప్రముఖులు చెరుకూరి రాజేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మునిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో తల్లిపాల వారోత్సవాలు

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): తుమ్మలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఇబ్రహీంపట్నం సెక్టార్ స్థాయి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై మహిళలకు అవగాహన సదస్సు సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మైలవరం ఐసీడీఎస్ శాఖ సీడీపీఓ కె.పుష్పలత మాట్లాడుతూ.. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పక ఇవ్వాలన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి ముర్రు పాలు తాగించాలని సూచించారు. వీటి ద్వారా బిడ్డ మెదడు, శరీరానికి పోషకాలు అందుతాయని పేర్కొన్నారు. సర్పంచి బొమ్ము వెంకటరమణ, సూపర్‌వైజర్ మాధవి, వైద్య ఆరోగ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా



తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్యకర్తలు

తిరువూరు: ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్‌ఫోన్లు తరచూ మొరాయిస్తున్నందున కొత్త ఫోన్లు ఇవ్వాలని కోరుతూ తిరువూరు అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలు సోమవారం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నిత్యం యాప్‌లతో కుస్తీ పడుతూ సమయం వృథా అవుతోందని, ఎన్నిసార్లు సెల్‌ఫోన్ల సమస్యను అధికారులకు తెలియజేసినా ఫలితం లేకపోవడంతో వాటిని స్వాధీనపరుస్తున్నామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుప్రజ తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మైలవరం: అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మైలవరం సీడీపీఓ కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమ ఆన్‌లైన్ వర్క్ చేయలేమని, 2జీ ఫోన్లు పనిచేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, 5జీ ఫోన్‌లు కావాలని డిమాండ్ చేస్తూ తమ వద్ద ఉన్న ఫోన్లు తిరిగి కార్యాలయంలో అందజేశారు. పాత పద్ధతిలో రిజిస్టర్ల వర్క్ చేస్తామని ఆన్‌లైన్ వర్క్‌తో మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు పుష్పకుమారి, సీహెచ్ శారద, ప్రాజెక్టు ఉపాధ్యక్షులు ఎస్.బుల్లెమ్మ, లలితాకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి



పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ మరోసారి రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొచ్చేందుకు గ్రామ, పట్టణ స్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మైలవరం నియోజకవర్గ బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడు మందా మధుబాబు చెప్పారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఆదేశాల మేరకు మందా మధుబాబు ఆధ్వర్యంలో కొండపల్లి మున్సిపాలిటీ బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడిగా డొక్కమాల పవన్‌కుమార్‌ను సోమవారం ఎన్నుకున్నారు. ఈసందర్భంగా పవన్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, నియోజకవర్గ అనుబంధ విభాగాల నాయకులు కుంచం జయరాజు, గోగులమూడి రాణి, సందిపాము రాజేష్, చందా చంటి, విద్యార్థి విభాగం నాయకులు రవి, చందు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి యాచకుల తరలింపు



విజయవాడకు యాచకులను తరలిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ లక్ష్మణరావు

ఇబ్రహీంపట్నం: యాచకులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో సీఐ చంద్రశేఖర్ చర్యలు చేపట్టారు. స్థానిక రహదారులపై సంచరిస్తున్న యాచకులను ట్రాఫిక్ ఎస్ఐ బి.లక్ష్మణరావు సహాయంతో విజయవాడలోని అనాథ ఆశ్రమాలకు సోమవారం రాత్రి ఆటోలో తరలించారు. సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆహార సేకరణ కోసం రోడ్లపై సంచరించటం వలన యాచకులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అనాథ ఆశ్రమాల్లో చేర్చడం వలన అక్కడ భోజన, వైద్యం, వసతి సదుపాయాలు అందుబాటులో ఉంటాయన్నారు. యాచకుల జీవన విధానం మెరుగుపడుతుందన్న ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. బైక్ ప్రమాదాల నివారణలో భాగంగానే ట్రాఫిక్ ఆంక్షలను విధించి తనిఖీలు చేపట్టామని తెలిపారు. వాహనదారులు సహకరించాలని సీఐ కోరారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు, నోట్‌బుక్స్ పంపిణీ



కేతనకొండలో విద్యార్థులతో ఎంఈఓ పుష్పలత తదితరులు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ పరిధిలోని(కాచవరం) ఎంపీపీ పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు మొహమ్మద్ ఇర్ఫాన్ పాషా అభ్యర్థన మేరకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన విశ్రాంత ఉద్యోగి హాజీ మహమ్మద్ ఖలీల్ రెహమాన్ విద్యార్థులకు బ్యాగ్‌లు, నోట్‌బుక్స్, స్నాక్స్ వితరణ చేశారు. ఎంఈఓ పుష్పలత దాత సమకూర్చిన బ్యాగ్‌లు, ఇతర పరికరాలు విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. గత మూడేళ్లుగా విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు, స్నాక్స్ బాక్స్‌లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వీరాస్వామి, హెచ్ఎం భవానీ, ఎస్ఎంసీ సభ్యులు, అంకసాల పవన్, గ్రామ పెద్దలు, గోపాల్ రావు, చలపతిరావు, సీఆర్పీ నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు

సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించకుండా గడువులోగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సబ్‌కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి విధించిన నిర్దిష్ట కాల పరిమితిలోగా పరిష్కరించాలన్నారు. వెంటనే పరిష్కరించదగిన వాటిని కూడా గడువు ముగిసే వరకు జాప్యం చేయొద్దని సూచించారు.

30 అర్జీల స్వీకరణ..

మండల స్థాయి అధికారులు పరిష్కరించాల్సిన సమస్యలను పరిష్కరించకపోవడం వలన ప్రజలు డివిజన్ స్థాయికి వస్తున్నారని, దీని వలన వారి సమయం, డబ్బు వృథా అవుతుందన్నారు. మండల స్థాయి అధికారులు తమ స్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఒకవేళ సమస్యను పరిష్కరించడానికి వీలు లేకపోతే అందుకు గల కారణాన్ని అర్జీదారుడికి తెలపాలన్నారు. కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి 30 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ జి.రమేష్, డీఎల్‌డీఓ పి.వెంకటరత్నం, కో–పరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.నాగలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, ఏడీఏ జి.విద్యాసాగర్, ఎంఈఓ–2 ఎస్.జమలయ్య, సీడీపీఓ పిల్లి విజయకుమారి, హెచ్ఓ ఆర్.హేమ, ట్రిపుల్‌ఐటీ ఎస్సైఐ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నూజివీడు: ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల నూజివీడు పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చలసాని వెంకట రామారావు, అధ్యక్షుడిగా ఎం.విజయ్, కార్యదర్శిగా నందా, సహాయ కార్యదర్శిగా అల్లం కనకదుర్గ, ఉపాధ్యక్షుడిగా ఎస్.హనుమంతరావు, కోశాధికారిగా పి.శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా ఎం.సుదర్శనం, బి.రవి, లక్ష్మణ, ఎం.జయరావు, పృథ్వీ, ఎం.రంగారావు, ఎం.రమేష్, టి.లక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఇందుపల్లి సత్యప్రకాష్, ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు పాల్గొన్నారు.

మురుగునీటి తటాకంతో ఇబ్బందులు



నూజివీడులో ఎన్నెస్పీ గేటు వద్ద దర్శనమిస్తున్న మురుగునీటి తటాకం

నూజివీడు: పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి దర్శనమిస్తున్న ఈ మురుగునీటి తటాకంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నెస్పీ గేటు వద్ద గుంతను ఏర్పాటు చేసి పక్కనే సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన కళాశాల బాలికల వసతి గృహంలో ఉన్న 80 మంది విద్యార్థినులు వాడిన మురుగునీటిని ఈ గుంతలోకి వదులుతుండటంతో ఇక్కడ మురుగునీటి తటాకం ఏర్పడింది. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సమీప గృహాల వారు వాపోతున్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా ఈ గుంత మున్సిపల్ అధికారులకు కనిపించడం లేదా అని వారు ప్రశ్నిస్తున్నారు. చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలు విజయవంతం చేయండి



కొండపల్లిలో ఐక్యత చాటుతున్న నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సెప్టెంబర్ 14, 15వ తేదీల్లో కొండపల్లిలో జరిగే సీఐటీయూ 12వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ జిల్లా కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిత్యం పోరాటాలు చేస్తోందన్నారు. మహాసభల విజయవంతానికి 78 మందితో నూతన ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు. ఆహ్వాన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, అధ్యక్షుడు మామిడి సీతారామారావు, ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్, కోశాధికారి వాసుదేవరావు, ఉపాధ్యక్షులు దేవినేని జోసీకుమారి, వెనిగళ్ల మురళీమోహన్, ఏ.విఠల్ రావు, కుంచం రాజేశ్వరిలను ఎన్నుకున్నారు.

ఎల్‌బీఆర్‌సీఈలో తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కళాశాలలో సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలన్నారు. కళాశాల కో ఫౌండర్ అండ్ హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ విద్యతో పాటు వినయవిధేయతలు అలవర్చుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి ఆన్‌లైన్‌లో మాట్లాడారు. కళాశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థికి లకిరెడ్డి ప్రసాదరెడ్డి తల్లి సరస్వతీ దేవి పేరున రూ.25 వేలు అందజేశారు. మొదటి స్థానంలో ఉత్తీర్ణులైన 101 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున చెక్కులను శ్రీనివాసరెడ్డి అందించారు. కార్యక్రమంలో ఎల్‌బీఆర్ ట్రస్టీ గోగులమూడి సాంబశివారెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్‌రెడ్డి, డీన్స్, వివిధ విభాగాల శాఖాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేరళలో నన్‌లను అరెస్ట్ చేయడం దుర్మార్గం



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, చర్చి సిబ్బంది

ఆగిరిపల్లి: కేరళకు చెందిన ఇద్దరు క్రిస్టియన్ నన్‌లను అన్యాయంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ఫాదర్ రవికుమార్ తెలిపారు. ఆగిరిపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, చర్చికి చెందిన ఫాదర్లు, సిస్టర్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ రవికుమార్ మాట్లాడుతూ గత నెల 25న కేరళకు చెందిన ఇద్దరు క్రిస్టియన్ నన్స్‌లను ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం మానవ అక్రమ రవాణా, మత మార్పిడిలు చేశారని ఆరోపణలతో అన్యాయంగా వారిని అరెస్ట్ చేసి, నిర్బంధించడం బాధాకరమన్నారు. దేశంలో అన్ని మతాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఫాదర్ ప్రతాప్‌రెడ్డి, ఫాదర్ జోసెఫ్, సిస్టర్లు షార్లెట్, రితమ్మ, జెల్సీ, సంతోషిని, నూతన ప్రియ పాల్గొన్నారు.

విద్యార్థుల హక్కులు హరించే జీవో రద్దు చేయాలి



తిరువూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తిరువూరు: ప్రభుత్వ విద్యా సంస్థలు, గురుకులాలు, వసతి గృహాల్లో ఇతరులు ప్రవేశించరాదని రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవోను నిరసిస్తూ తిరువూరులో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన జరిపారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునే బాధ్యత కలిగిన ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి ప్రవేశించకుండా అక్రమంగా జారీచేసిన జీవో ప్రతులను విద్యార్థులు దగ్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా ఉదాసీన వైఖరి అవలంబిస్తుంటే తాము చూస్తూ ఊరుకోబోమని, ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు పెట్టినా ఉద్యమిస్తామని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, మోహన్‌కృష్ణ, సీఐటీయూ నాయకుడు బి.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.